నాకు నచ్చిన కథను గురించి పాఠకులు విశ్లేషణ రాసి పంపితే ప్రచురిస్తాం. తగిన విశ్లేషణకు పారితోషికం ఉంటుంది

నాకు నచ్చిన కథ!

# "ఎసరూ - అత్తిసరూ" కథా విశ్లేషణ

పరిచయం. – మునిపల్లెరాజు

భారతదేశపు ఆధ్యాత్మిక సాంస్కృతిక అఖండతకు, ఏకతకు ప్రతీకలు మూడు - హిమాలయాలు, గంగానది, రామాయణ కావ్యం.

ఆంధ్ర లేక త్రిలింగ దేశాన్ని తర తరాలనుండీ భావసమైక్యతతో ప్రభావితం చేసిన శక్తులు - తిరుపతి వెంకటేశ్వరుడూ, శ్రీశైలం మల్లికార్జునుడూ, యాదగిరి నరసింహుడూ, గోల్కొండ రామదాసూ, త్యాగరాజూ పోతులూరి వీరబ్రహ్మం, క్రిష్ణా గోదావరీ నదీమతల్లులు.

ఈ చివరి శక్తి గోదావరి - అఖండ జీవనది - వ్రాయించిన కథ యిది. పోతనామాత్యుడు సవినయంగా చెప్పుకొన్న ఆత్మనివేదనలో- "పలికెడిది భాగవతమట, పలికించినవాడు రామభద్రుండట" అనే ఋషి వాక్కు వుంది. బి.వి.యస్ రామారావు అనే అజ్ఞాత ఇంజనీరు, తను సివిల్ ఇంజనీరుగా పట్టభద్రుడైనా, గోదావరి కలల్లో మమేకమై యంత్రాల ఇంజనీరుగా మారి ఆ గోదావరి నదీ జలాల నీటి పారుదల శాఖలో తన వుద్యోగ జీవితమంతా గడిపిన స్వాప్నికుడు. ఆయన రచించిన యీ కథ. తన భాషలో గాక గోదావరి నదీ తీరనుడికారంతో వెలువడటానికి చోదక శక్తి ఆనదీమతల్లే గదా. కనుక కథకుడికి నాతో పేచీరాదు.

మరొక కారణం వల్ల గూడా యీ కథవైపు నేను ఆకర్షితుడనైనాను.

సుమారు రెండేళ్లక్రితం, ప్రముఖ కథకులు కాళీ పట్నం రామారావు గారింట్లో ఒక వృద్ధ మాతృమూర్తి పరమపదించింది. ఆమె సహస్రమాసజీవి. సకాలంలో వచ్చే సహజమరణం- ఆతల్లిది. కాని విజ్ఞులైన రామారావు మాష్టారు గూడా ఆ వియోగానికి సమాధాన పడలేక దుఃఖ భారంతో విలపిస్తూ బంధుమిత్రబృందానికి కనిపించారు.

పలకరింపులకు తరలి వెళ్లిన మిత్రులు అనునయించారు.

"మాష్టారూ, ఆమె నిండు జీవితం జీవించింది. మనుమలు పెళ్లిళ్లు చేయించింది. ముని మనుమల చదువులు చూసింది. ధన్య జీవిగదా, ఎందుకు రొదిస్తారు?"

మాష్టారుగారి సమాధానాన్ని వాళ్లబ్బాయి కాళీపట్నం సుబ్బారావు నోటినుంచి నేను విన్నాను.

"బాబూ, మరణించిందని కాదు నేను దుఃఖిస్తున్నది. మళ్లీ అటువంటి గొప్ప మానవతా విలువలున్న వ్యక్తి కనిపించదు గదా."

ఆంధ్రదేశాన్ని చీకటి శతాబ్దాల పాశవిక నాగరికత దిక్కుగా నడిపిస్తూన్న సినిమా నిర్మాతలు, శివసాహిత్య అశ్లీల హింసా కుహనా విద్యావంతులు, ప్రాంతీయ కుల తత్వ పోషకులైన మిథ్యారాజకీయ దురంధరులూ, పై వ్యాఖ్యకు చలించక పోవచ్చుగాని హృదయమున్న ప్రతి సామాన్య వ్యక్తి, కొంచెం ఆగి నిదానంగా ఆలోచించుకొనే వ్యవధిని కల్పించే సమాధానం ఇది.

అప్పటి నుంచీ నేనూ అన్వేషిస్తున్నాను-- మాష్టారు పూజించిన అటువంటి వృద్ధ మాతృమూర్తి. మూర్తిమంతాన్ని ఏ కథకుడైనా కథా నిబద్ధం చేశాడా- అని.

మా అమ్మను కథా వస్తువుగా మార్చి నేను వ్రాసిన అమ్మ కథలూ, పూనాలో లా కాలేజి మిత్రుడు. ఇన్‌కమ్‌టాక్స్ కమిషనర్‌గా దూరమై పోయిన గోగినేని సత్యనారాయణ వ్రాసిన అద్భుతమైన తల్లి కథలు- ఎన్నింటినో స్మృతికి తెచ్చుకొన్నాను. కాని యీ కథల్లో తల్లిమూర్తి కన్పించలేదు. ఎట్లా కన్పిస్తుంది? ఈ తల్లి గోదావరి తీరవాసి. ఈ తల్లి డొక్కా సీతమ్మను పోలిన తెలుగుతల్లి- అన్నపూర్ణ.

ప్రతి జాతికి ఒక ప్రత్యేక భాష- ప్రతి నదికీ ఒక వైయక్తిక భాష. గోదావరి వేదఘోష, గోదావరి వేదనాత్మ ద్విజటగా అభివ్యక్తీ కరించుకొనే కథ. ఎందుకంటే ఈ కథలో గోదావరి నిరామయ తపస్వినిగా సముద్ర దిశగా పారుతూన్న కళలో లేదు. వరదల్లో రుద్రకాళి నృత్య భాషతో వుప్పొంగి పోతున్న భీభత్స సుందరి- ఆమె. నేను గవేషిస్తున్న మూర్తి లభించింది.

కథా కాలపరిధి- ఒకే ఒక్కరోజు. సూర్యభగవానుడు దర్శన మివ్వని రోజు. ప్రధాన పాత్ర-నదిదే-అని చెప్పుకొన్నాంగదా.

ఒక వృద్ధ బ్రాహ్మణ వితంతువు- వర్ధనమ్మ

ఆమె మనవడు భాస్కరం- చిరుద్యోగియైన సన్నకారు 'హెన్‌పెక్డ్ హస్బెండ్.'

అతని భార్య కమల. తరాల అంతరం అనబడే జనరేషన్ గ్యాప్‌కు సరైన రూపకల్పన.

చివరగా- సత్తిగాడు అనబడే ఒక శ్రామికుడు.

రాజమండ్రి లంపెన్ ఎలిమెంట్. (ఈమాట ఎందుకంటున్నానో కథ చదివితే తెలుస్తుంది).

నిజానికి వర్దనమ్మ గారికి మానసపుత్రుడు చివరకు వారసుడు.

ఈ పాత్రలతో నడిచే గొప్ప హ్యూమన్ డ్రామా. ఏ సంఘటనలోనూ పాశ్చాత్య కథాకథన ప్రభావం లేదు. ఏ పాత్ర స్వభావంలోనూ యిసుమంత అసహజత్వమూ కనిపించదు. అచ్చమైన తెలుగు కథ. అందరి ముసలమ్మల మరణాలూ దుస్సహపరివేదనలు కావు. కాజాలవు. కాని యీ కథలోని వర్ధనమ్మ మరణం మాత్రం అట్టి తీవ్రసంవేదనను కలుగ జేస్తుంది. సత్తిగాడు అమాయికంగా అన్న మాటలు, కొద్ది క్షణాల్లో జరుగనున్న ఒక విషాద సంఘటనకు నాందీ వాక్యాలుగా నిలిచిపోగా పాఠకుడు ఒక ఆర్ద్రమైన విషాదాను భూతికిలోనై తిరిగి తిరిగి వాటిని మననం చేసుకొంటాడు ("ఇయ్యాల సూడండి. గోదారంతా గాలించి మీ జన్మలో యింక పుల్లల్ని కొనక్కర్లేకండా చేత్తాను"). అవును, అంతే జరిగింది గదా అని.

కథలు- రెండు రకాలు. మేధస్సుతో ప్రభావితమైనవీ, హృదయంతో ప్రభావితమైనవి. శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి గారి మాటల్లో- ఎక్కడ మేధస్తు ప్రధానమో అక్కడ అనుభూతి తక్కువ.

ఎక్కడ పునాది హృదయమో ఆ కథ కళాబంధురం.

ఈ కథకు హృదయం పునాది. అందువల్ల రససిద్ధి లభించింది.

పెద్ద విశ్లేషణ కథ రమ్యతకు చెడుపు. అందువల్ల మీరే చదువుకొని నిజం నిగ్గు తేల్చుకోండి.

